సాక్షి
శ్రీకాకుళం
శనివారం । 23 । డిసెంబర్ । 2023



అన్నదాతకు మద్దతు

ప్రభుత్వం అన్నదాతకు మద్దతు అందిస్తోంది. సీజన్‌కు ముందే మద్దతు ధర ప్రకటిస్తోంది.

- 8లో



ఉత్తర ద్వార దర్శనాలకు..

నేడు వైకుంఠ ఏకాదశి. ఉత్తర ద్వార దర్శనాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి.

- 8లో

నేడు క్రిస్మస్ హైటీ

శ్రీకాకుళం పాతబస్టాండ్: క్రిస్మస్ సందర్భంగా శనివారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఉదయం 10.30కు హైటీ వేడుకలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ తెలిపారు. కార్యక్రమానికి క్రిస్టియన్ పెద్దలు, జిల్లాలోని ఆయా సంఘాలకు సంబంధించి సంఘ కాపరులు, మైనార్టీ నాయకులు హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

న్యూస్‌రీల్

ఎస్‌ఐలుగా అన్నదమ్ములు ఎంపిక



ఎస్‌ఐ ఉద్యోగాలను సాధించిన అన్నదమ్ములు

ఎచ్చెర్ల: లావేరు మండలంలోని బెజ్జిపురం గ్రామానికి చెందిన అన్నదమ్ములు కలిశెట్టి రాంబాబు, రవి ఎస్‌ఐ పరీక్ష ఫలితాల్లో విజయం సాధించారు. 232, 238 మార్కులు సాధించి ఏపీఎస్పీ ఎస్‌ఐలుగా ఎంపికయ్యారు. తల్లిదండ్రులు కలిశెట్టి సన్యాసినాయుడు, అన్నపూర్ణ వ్యవసాయ పనులు చేస్తూ పిల్లలను ఉన్నత చదువులు చదివించారు. అన్నదమ్ములు ఉద్యోగాలు సాధిండంతో వారికి పలువురు అభినందనలు తెలిపారు.

రిమాండ్ ఖైదీ పరారీ



ఖైదీ పరారీపై వివరాలు సేకరిస్తున్న కోటబొమ్మాళి ఎస్‌ఐ మహమ్మద్ అలీ

కోటబొమ్మాళి: శ్రీకాకుళం అంపోలు జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న సంతబొమ్మాళి మండలం బడేనర్సపురానికి చెందిన నైనపాత్రుని ముకుందరెడ్డి శుక్రవారం కోటబొమ్మాళిలో ఆర్మ్‌డ్ రిజర్వ్‌డ్ పోలీసుల నుంచి తప్పించుకొని పారిపోయాడు. ఎస్‌ఐ షేక్ మహమ్మద్ అలీ తెలిపిన సమాచారం ప్రకారం.. నర్సపురంలో మూడు నెలల కిందట శివాలయంలో జరిగిన దొంగతనం కేసులో ముకుందరెడ్డి రిమాండ్ ఖైదీగా అంపోలు జైలులో ఉన్నాడు. ఈ నేపథ్యంలో శుక్రవారం జైలు నుంచి ఇద్దరు ఆర్మ్‌డ్ రిజర్వ్‌డ్ పోలీసులు ముకుందరెడ్డిని కోటబొమ్మాళి కోర్టులో హాజరుపరిచారు. కేసు జనవరి 5కు వాయిదా వేశారు. అనంతరం ముకుందరెడ్డిని జైలుకు తీసుకెళ్లేందుకు కోర్టు సమీపంలోని బస్టాప్ వద్ద వేచి ఉన్నారు. అంతలో మూత్ర విసర్జనకు వెళ్తానని చెప్పిన ముకుంద రెడ్డి అక్కడి నుంచి మెల్లగా జారుకుని జాతీయ రహదారి దాటి కిష్టుపురం వంశధార కాలువ వైపు పారిపోయాడు. పోలీసులు పట్టుకునేందుకు ప్రయత్నించినా అతను దొరకలేదు. దీనిపై సమాచారం అందుకున్న కోటబొమ్మాళి ఎస్‌ఐ, సిబ్బందితో కలిసి రాత్రి వరకూ సమీప గ్రామాలు, తిలారు, కోటబొమ్మాళి రైల్వే స్టేషన్లలో వెతికినా అతని ఆచూకీ లభించలేదు. ఆర్మ్‌డ్ రిజర్వ్‌డ్ పోలీసులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేశామని ఎస్‌ఐ తెలిపారు.

పునరావాస కాలనీ పనుల పరిశీలన




పునరావాస కాలనీ పనులను పరిశీలిస్తున్న జేసీ నవీన్‌కుమార్, సబ్ కలెక్టర్ నూరుల్ కమర్

టెక్కలి: సంతబొమ్మాళి మండలం మూలపేట పోర్టు నిర్వాసితుల కోసం నౌపడ వద్ద నిర్మిస్తున్న పునరావాస కాలనీ పనులను శుక్రవారం జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్‌కుమార్, టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమర్‌తో పాటు ఆర్‌అండ్‌బీ, పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పరిశీలించారు. ఈ మేరకు పునరావాస కాలనీ పనులు ఎంత మేరకు పూర్తయ్యాయో అడిగి తెలుసుకున్నారు. జనవరి నెలలో నీటి సరఫరాకు చర్యలు చేపడుతున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు వెల్లడించారు. అనంతరం పోర్టు రైల్వే లైన్ కోసం పోతునాయుడుపేట, కాశీపురం, కోటపాడు గ్రామాలను పరిశీలించారు. వీరితో పాటు ఆర్ అండ్ బీ ఎస్‌ఈ జె.సుధాకర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ, పీఆర్ ఈఈ, తహసీల్దారు చలమయ్య ఉన్నారు.

'ముమ్మరంగా గార ఎస్‌బీఐ కేసు దర్యాప్తు'

శ్రీకాకుళం క్రైమ్ : గార ఎస్‌బీఐ కేసు దర్యాప్తును ముమ్మరం చేస్తున్నామని డీఎస్పీ యర్రగుంట శ్రుతి తెలిపారు. ఆమె శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. గార ఎస్‌బీఐ బంగారం మాయం కేసులో రిమాండ్‌లో ఉన్న ఇద్దరినీ కోర్టు అనుమతితో మళ్లీ విచారించామని తెలిపారు. ఈ కేసుకు సంబంధించి విభిన్న కోణాల్లో విచారణ చేస్తున్నామని వెల్లడించారు. క్యాషియర్ సురేష్‌పై కేసు బయట పడక ముందు జరిగిన దాడి విషయాన్ని ప్రస్తావించగా.. ఇంకా దర్యాప్తులోనే ఉందని సమాధానం చెప్పారు. అలాగే జిల్లా కేంద్రంలోని ఎస్బీఐ మ్యూచువల్ ఫండ్స్‌పై వస్తున్న ఆరోపణలు, అవకతవకల విషయం తమ దృష్టికి రాలేదని ఆమె తెలిపారు. ఖాతాదారులు మోసపోయామని గానీ, బ్రాంచి సిబ్బంది నుంచి గానీ ఎలాంటి ఫిర్యాదులు రాలేదని తెలిపారు.

యంత్ర ముగ్ధం



ఊరికి ఊపిరి

ఆస్తులు తాకట్టు పెట్టి.. ఉన్నదంతా ఆస్పత్రులకు ధారబోసి, ఆఖరకు ప్రాణాలు వదిలేసిన వారి కథలు ఉద్దానంలో ఊరూరా కనిపిస్తాయి. ఉన్న చోట ఉన్నత వైద్యం దొరక్క, ఊరు విడిచి పెట్టి వెళ్లి చికిత్స చేయించుకునే స్థోమత లేక ఊపిరి ఆగిపోయిన దీనగాథలు ఏ వీధికి వెళ్లినా వినిపిస్తాయి. అలాంటి వేదనలకు స్వస్తి పలుకుతూ పలాస కిడ్నీ పరిశోధన కేంద్రం సరికొత్త యంత్రాలతో సిద్ధమైంది. విశాఖ వెళ్తే గానీ దొరకని అత్యున్నత వైద్యం ఇక్కడ ఇక నుంచి ఉచితంగానే లభించనుంది. భవనాల నిర్మాణాలకే పరిమితమై పోకుండా అధునాతన యంత్రాలను తెప్పించి వైఎస్ జగన్ సర్కారు తన చిత్తశుద్ధిని చాటుకుంది. రూ.కోట్లు విలువ చేసే ఈ యంత్రాల వివరాల్లోకి వెళితే..

– కాశీబుగ్గ

- కిడ్నీ ఆస్పత్రిలో అధునాతన యంత్రాలు
- సామాన్యులకు అందుబాటులో ఖరీదైన వైద్యం
- విశాఖ వెళ్లాల్సిన అవసరం లేకుండా ఇక్కడే చికిత్సకు అవకాశం



సీటీ స్కాన్



రూ.రెండు కోట్లతో ఏర్పాటు చేసిన సీటీ స్కాన్

రూ.రెండు కోట్లు ఖరీదైన కెనాన్ కంపెనీకి చెందిన సీటీ స్కానింగ్ మిషన్‌ను ఇక్కడ ఏర్పాటు చేశారు. సీటీ స్కాన్ చేయాలంటే శ్రీకాకుళం, విశాఖ వెళ్లక తప్పేది కాదు. ప్రైవేటు ల్యాబ్‌లకు వెళ్లినా రూ.4 వేల నుంచి రూ.6వేలు ఖర్చవుతుంది. ఇప్పుడు ఇక్కడే ఆ సేవలు ఉచితంగా లభిస్తాయి. కిడ్నీ రోగులకే కాదు ఈ ప్రాంతంలో అత్యవసర సేవలన్నింటికీ ఈ మిషన్ ఉపయోగపడుతుంది.

ఈఎస్‌డబ్ల్యూఎల్



రూ.రెండు కోట్ల విలువైన ఈఎస్‌డబ్ల్యూఎల్ మిషన్

కిడ్నీలో రాళ్లను ఎలాంటి ఆపరేషన్ లేకుండా తొలగించే మిషన్ ఇది. అధునాతన సాంకేతికతతో కూడిన ఈ మిషన్ ద్వారా కేవలం లేజరు కిరణాలతో విడతలగా రాళ్లను పగలగొడతారు. ఈ వైద్యానికి కార్పొరేట్ ఆస్పత్రిలో విడతకు రూ.20వేల నుంచి రూ.30 వేల చొప్పున రూ.లక్ష వరకు ఖర్చవుతాయి. ఈ యంత్రం ఖరీదు సుమారు రూ.2 కోట్లుపైగా ఉంటుంది.

ఆల్ట్రా సౌండ్ మిషన్

ఆల్ట్రా సౌండ్ మిషన్‌లు సుమారు ఐదు ఏర్పాటు చేశారు. ఒక్కో మిషన్ ఖరీదు రూ.20లక్షలు ఉంటుంది. అన్ని మిషనరీలు కలిపితే రూ.2 కోట్లు పైమాటే. ఇందులో కడుపులో భాగాలు, కిడ్నీలు వంటి భాగాలతో పాటు దేహంలో ఉన్న ఏ భాగాలలోనైనా సమస్య ఏమిటన్నది గుర్తించడానికి ఈ స్కానింగ్ విభాగం ఉపయోగపడుతుంది.

డిజిటల్ ఎక్స్‌రే



డిజిటల్ ఎక్స్‌రే మిషన్

కాలు, చేతులు, చెస్ట్ ఇతర ఏ ప్రాంతంలో ఎముకలు విరిగినా, పగుళ్లు ఇచ్చినా జాయింట్లు తప్పినా ఏదైనా ఈ ఎక్స్‌రే ద్వారా తెలుస్తుంది. అయితే ఇక్కడ ఏర్పాటు చేసిన ఎక్స్‌రే మాత్రం పూర్తి డిజిటల్‌తో కూడుకున్నది. సుమారు రూ.10లక్షలపై ఖరీదు చేసే ఈ మిషన్‌లు అనేక రకాలు ఉన్నాయి. ఆ యూనిట్ అంతా ఓ గదిలో ఏర్పాటు చేశారు.

యూఆర్‌ఎస్‌ఎల్

ఇదో ప్రత్యేకమైన లేజరు మిషన్. కిడ్నీలోని రాళ్లను కటింగ్ చేయడానికి ఉపయోగిస్తారు. ముందు వివరించిన మిషన్ రాళ్లను బయట నుంచి కట్ చేస్తే ఈ మిషన్ మాత్రం పైపుద్వారా కిడ్నీకి చేరుకుంటుంది. అక్కడ కట్ చేసి ముక్కలను బయటకు తీసుకువస్తుంది. ఈ మిషన్ ఖరీదు రూ.25లక్షలపై ఉండవచ్చు. బయట ఆస్పత్రుల్లో ఈ చికిత్సకు రూ.60 వేలు వరకు చార్జ్ చేస్తారు.

రిఫ్రిజిరేటర్‌లు



-80 డిగ్రీ సెంటీగ్రేడ్ ఫ్రీజర్

కిడ్నీ వ్యాధిగ్రస్తులు, ఇతర వ్యాధులతో ఉన్నవారి కోసం అవయవాలను దాచాలన్నా, భద్రంగా ఉంచాలన్నా -80 డిగ్రీలు, -40 డిగ్రీల సెంటీగ్రేడ్ రిఫ్రిజిరేటర్లు కావాలి. కిడ్నీ పరిశోధన చేసే పరిశోధకులకు ఇవి శాంపిల్ కలెక్షన్, వాటి పరిశీలనకు ఉపయోగపడుతుంది.

క్రయోస్పాట్ మిషన్

క్యాన్సర్‌కు గురైనటువంటి సెల్స్‌ను, శరీర భాగాలను కలపడం వంటి ప్రక్రియల్లో ఇది ఎంతగానో ఉపయోగపడుతుంది. సుమారు రూ.30లక్షలు ఖరీదు చేసే ఈ యంత్రంతో వైద్యం పొందాలంటే ఇదివరకు పెద్ద పట్టణాలకు చేరుకోవాల్సి ఉంటుంది. ఇప్పుడు ఇక్కడ ఉచితంగా అందించనున్నారు.

పది వెంటిలేటర్లు..



అధునాతన హంగులతో ఆపరేషన్ థియేటర్

అత్యవసర పరిస్థితిలో ఆక్సిజన్ అందనని వారికి వెంటిలేటర్‌లు ఎంతగానో ఉపయోగపడతాయి. ఇప్పుడిప్పుడు శ్రీకాకుళం పట్టణానికి వచ్చాయి. ఇదివరకు విశాఖపట్నం పరుగులు పెట్టేవారు. ఒక్కో వెంటిలేటర్‌కు రూ.12లక్షల వెచ్చించి పది వెంటిలేటర్‌లకు రూ.1.20 కోట్లు కేటాయించి ఏర్పాటు చేశారు. అత్యవసర పరిస్థితి వస్తే పలాస చేరుకుంటే సరిపోతుంది.

ఫుల్లీ ఆటోకెమిస్ట్ బయోకెమిస్ట్ ఎనలైజర్

ఈ యంత్రం కిడ్నీ పరిశోధన కేంద్రానికి ఎంతగానో ఉపయోగపడుతుంది. యూరిన్ టెస్ట్, బ్లడ్ టెస్ట్, బ్లడ్ సెల్స్ టెస్ట్, క్రియోటిన్ లెవెల్స్‌తో పాటు 64 రకాల పరీక్షలు ఈ యంత్రంతో తెలుసుకోవచ్చు. ప్రస్తుతం ఉండే మోడల్ రూ.పన్నెండు లక్షలు. బయట మార్కెట్‌లో ఒక్కో పరీక్షకు ఒక్కో ధర ఆయా ఆస్పత్రిని బట్టి నిర్ధారిస్తారు. ఈ ఆస్పత్రిలో మాత్రం ఉచితంగా సేవలు అందుతాయి.



వివిధ రకాల పరీక్షలు జరిపే మిషన్లు

అత్యాధునిక యంత్రాలు ఉన్నాయి



ఉత్తరాంధ్రలో ఎక్కడా లేని పరికరాలు పలాస కిడ్నీ పరిశోధన కేంద్రంలో ఏర్పాటు చేశారు. సీటీ స్కాన్, ఈఎస్‌డబ్ల్యూఎల్, యూఆర్‌ఎస్‌ఎల్ వంటి యంత్రాలన్నీ రూ.కోట్లు ఖరీదు చేస్తాయి. ఈ పరీక్షలు బయట చేయాలన్నా రూ.లక్షల్లో ఖర్చవుతుంది. కిడ్నీ రోగులకు ఉచితంగా ఆ సేవలు అందించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వీటిని ఏర్పాటు చేశారు. డాక్టర్ రిఫర్ చేసిన విధానం బట్టి ఇక్కడ పరీక్షలు చేస్తారు. కిడ్నీ వ్యాధిగ్రస్తులే కాదు ఈ ప్రాంతీయులకు ఎలాంటి సమస్య వచ్చినా ఈ యంత్రాలు ఉపయోగపడతాయి.

– డాక్టర్ సి జయరాజ్, సూపరింటెండెంట్, కిడ్నీ పరిశోధన కేంద్రం

పోస్టు గ్రాడ్యుయేషన్ కోర్సుల్లో స్పాట్ అడ్మిషన్లు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలోని పోస్టు గ్రాడ్యుయేషన్ కోర్సుల్లో ఖాళీ సీట్లను స్పాట్ అడ్మిషన్లతో భర్తీ చేసేందుకు ఉన్నత విద్యా మండలి అనుమతి ఇచ్చినట్లు అడ్మిషన్స్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్.ఉదయ్‌భాస్కర్ తెలిపారు. వర్సిటీలో శుక్రవారం వివరాలు వెల్లడించారు. వర్సిటీలో 16 కోర్సుల్లో ఖాళీ సీట్లకు ప్రవేశాలు కల్పించనున్నట్లు చెప్పారు. ఈ నెల 26 నుంచి 29వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం విభాగాలు, సబ్జెక్టుల వారీగా 29వ తేదీ సాయంత్రం ప్రవేశాలకు అర్హత సాధించిన వారి జాబితా సిద్ధం చేసి, 30న ప్రవేశాలు నిర్వహిస్తామని అన్నారు. ఉన్నత విద్యా మండలి నిబంధనలు మేరకు రాష్ట్ర పోస్టు గ్రాడ్యుయేషన్ ఎంట్రన్స్ టెస్ట్ అర్హత మార్కులు తప్పనిసరని తెలిపారు. స్పాట్ అడ్మిషన్లు పొందిన వారికి జగనన్న విద్యా దీవెన, జగనన్న వసతి దీవెన పథకాలు వర్తించవని అన్నారు. ఫీజు స్ట్రక్చర్ మేరకు ఫీజులు చెల్లించాల్సి ఉంటుందని అన్నారు.

ఎంబీఏ, ఎంసీఏల్లో స్పాట్ అడ్మిషన్లకు అనుమతి

ఎచ్చెర్ల క్యాంపస్: ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ఖాళీ సీట్లకు స్పాట్ అడ్మిషన్ల నిర్వహణకు ఉన్నత విద్యా మండలి అనుమతులు మంజూరు చేసింది. ఈ మేరకు శుక్రవారం నుంచి ఈ నెల 27 వరకు ప్రవేశాలు చేసుకోవచ్చునని తెలిపింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో ఎంబీఏలో 55 సీట్లు ఉండగా, 39 మంది ప్రవేశాలు పొందారు. 16 సీట్లు ఖాళీగా ఉన్నాయి. ఎంసీఏలో 44 సీట్లకు 39 మంది ప్రవేశాలు పొందారు. ఐదు సీట్లు ఖాళీగా ఉన్నాయి. తక్షణ ప్రవేశాలకు ఏపీ ఐసెట్ ర్యాంకు తప్పనిసరిగా కాగా, ప్రభుత్వ రాయితీలు ఏవీ వర్తించవు. రిజిస్ట్రేషన్ ఫీజు రూ.1000 గా నిర్ణయించారు. 28వ తేదీన సీట్లు పొందిన విద్యార్థుల వివరాలు వెబ్ పోర్టల్‌లో నమోదు చేస్తారు.

ఐటీఈపీలో ఐదుగురికి ప్రవేశాలు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో నూతనంగా ప్రారంభించిన ఐటీఈపీ (నాలుగేళ్ల సమీకృత డిగ్రీకోర్సు)లో శుక్రవారం తక్షణ ప్రవేశాలు నిర్వహించారు. ఈ ప్రక్రియను అడ్మిషన్స్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్.ఉదయ్‌భాస్కర్ పర్యవేక్షించారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహించిన నేషనల్ కౌన్సెల్ ఫర్ ఎడ్యుకేషన్ టెస్ట్ అర్హత సాధించిన ఐదుగురికి ప్రవేశాలు కల్పించారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే వారి కోసం శనివారం కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు చెప్పారు.

నిధుల రికవరీకి కలెక్టర్ ఆదేశాలు

కోటబొమ్మాళి: మండలంలోని శ్రీజగన్నాథపురం సచివాలయం పరిధిలో ఆర్‌బీకే భవనం, వెల్‌నెస్ సెంటర్ నిర్మాణాలను గతంలో కాంట్రాక్టర్ ప్రారంభించి సగంలోనే ఆపేశారు. అప్పట్లో ప్రభుత్వం ఇచ్చిన సిమ్మెంటు బస్తాలను దుర్వినియోగం చేసినట్లు ఆయనపై కలెక్టర్‌కు కొందరు ఫిర్యాదు చేశారు. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు తహసీల్దార్ జామి ఈశ్వరమ్మ, ఎంపీడీఓ కె.ఫణీంద్రకుమార్ ఆధ్వర్యంలో కమిటీ శుక్రవారం భవన నిర్మాణాల ప్రాంతాన్ని పరిశీలించారు. కాంట్రాక్టర్ నుంచి నిధులు రికవరీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని, నిర్మాణ పనులు కొనసాగించాలని సర్పంచ్ నూక సత్యరాజ్‌కు ఎంపీడీఓ సూచించారు.

యూత్ క్రిస్మస్

శ్రీకాకుళంలోని సెయింట్ జోన్స్ లూథరన్ చర్చి ఆధ్వర్యంలో యూత్ క్రిస్మస్ వేడుకలు శుక్రవారం జరిగింది. చర్చి పాస్టర్ టి.రాజ్‌కిరణ్ ఆధ్వర్యంలో ప్రార్థనలు జరిగాయి. యువకులంతా కలసి క్రైస్తవ గీతాలాపనలు చేశారు. కార్యక్రమంలో డేవిడ్ సన్, స్టీవెన్, జాన్ సున్నీ, హేన్రీ, రేష్మా, యువతీ, యువకులు, తదితరులు పాల్గొన్నారు.

-శ్రీకాకుళం కల్చరల్



క్రైస్తవ గీతాలు ఆలపిస్తున్న యువతీ, యువకులు

'అంకితభావంతో పనిచేద్దాం'

శ్రీకాకుళం పాతబస్టాండ్: విధి నిర్వహణలో సిబ్బంది అంకితభావంతో ఉండాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ జీవి చిట్టిరాజు అన్నారు. ఆయన శుక్రవారం జిల్లా కార్యాలయంలో ఏపీఓలు, ఇంజినీరింగ్ కన్సల్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ప్లాంటేషన్ పనులతో పాటు ఫారం పాండ్స్, పెర్క్యులేషన్ ట్యాంకులు, మినీ పెర్క్యులేషన్ ట్యాంకులు, డగౌట్ పాంట్స్, మినీ గోకులాలు వంటి పనులకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉంటుందన్నారు. పంట కాలువల పనులను తక్షణమే ప్రారంభించి పూర్తి చేయాలని సిబ్బందికి ఆదేశించారు. గ్రామాల అభివృద్ధికి అవసరమైన అన్ని రకాల పనులను గుర్తించి ఎస్టిమేషన్లు వేయాలని సూచించారు. వ్యక్తిగత పండ్ల తోటల పెంపకంతో పాటు మునగ మొక్కల పెంపకంపై రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. హౌసింగ్ 90 పది జనాల కల్పన పనులను తక్షణమే పూర్తి చేయాలని పేర్కొన్నారు. అన్ని పంచాయతీల పరిధిలోనూ పనులను ప్రారంభించారని, నిర్దేశించిన లక్ష్యాల మేరకు వేతనదారులు పనులకు వచ్చే విధంగా క్షేత్రస్థాయిలో ఎప్పటికప్పుడు పరిశీలించి అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. వంద రోజుల పనితో పాటు, సగటు వేతనం రూ. 250 వచ్చేలా చేయాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు.

క్రిస్మస్ వెలుగులు





క్రిస్మస్‌కు చర్చిలు అందంగా ముస్తాబవుతున్నాయి. జిల్లా కేంద్రంలోని పురాతన ఆరాధన మందిరాలను విద్యుత్ దీపాలతో అందంగా అలంకరిస్తున్నారు. శాంతాక్లాజ్, క్రిస్మస్ ట్రీలతో సుందరంగా మారుస్తున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, శ్రీకాకుళం

పకడ్బందీగా ధాన్యం కొనుగోలు

- జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్

శ్రీకాకుళం పాతబస్టాండ్: రైతుకు పూర్తి భరోసా కల్పించేలా, అత్యంత పకడ్బందీగా ధాన్యం కొనుగోలు ప్రక్రియను నిర్వహిస్తున్నామని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ అన్నారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం జరిగిన జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతు శ్రేయస్సే లక్ష్యంగా ప్రభుత్వం ధాన్యం కొనుగోలు ప్రక్రియను అత్యంత పారదర్శకంగా రూపొందించిందని తెలిపారు. రైతు ఎంతో కష్టపడి పండించిన ధాన్యానికి సరైన గిట్టుబాటు ధరను ఇవ్వడం మన బాధ్యత అని, ప్రతి ధాన్యం గింజను కొనుగోలు చేస్తామని అన్నారు. జిల్లాల్లో ఇప్పటి వరకూ 12,194 మంది రైతుల నుంచి 70 వేల టన్నుల వరకూ ధాన్యం కొనుగోలు చేసినట్టు చెప్పారు.

ఇందులో జలుమూరు, సారవకోట, నరసన్నపేట, సంతబొమ్మాళిలో రైతులు ఎక్కువ సంఖ్యలో ధాన్యం తరలించేందుకు ముందుకు వస్తున్నారని పేర్కొన్నారు. పలాస, రణస్థలం, పొందూరు, హిరమండలం, కవిటి, కంచిలి మండలాల్లో ఇంకా కేంద్రాలు ప్రారంభం కాకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. జీపీఎస్ పరికరాల కొరత లేకుండా చూడాలని ఆదేశించారు.



వ్యవసాయ సలహామండలి సమావేశంలో మాట్లాడుతున్న జేసీ నవీన్

ప్రత్యామ్నాయంపై దృష్టి పెట్టండి

వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో వంశధార, నాగావళి నదుల పరిధిలోని ప్రాజెక్టుల నుంచి ఈ ఏడాదికి రబీ పంటల సాగుకు ఆశించిన స్థాయిలో సాగు నీరు ఇవ్వడం సాధ్యం కాదని జేసీ చెప్పారు. రైతులు ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని వరి పంటలకు బదులుగా ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలన్నారు. ముందస్తు రబీ పంటలు, కాలువల కింద ఆరుతడి పంటల సాగు తదితర అంశాలపై సమావేశంలో జరిగిన చర్చ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వంశధార కాలువల నుంచి రానున్న 15 రోజుల పాటు నీటిని విడుదల చేస్తామని, అలాగే నారాయణపురం నీటితో కూడా చెరువులు ఆయా చోట్ల నిండేలా చర్యలు తీసుకోవాలన్నారు. మడ్డువలసలో నీటి కొరత కారణంగా 1500 ఎకరాలకు రబీ కింద నీరు ఇవ్వడం సాధ్యమవుతుందని చెప్పారు. సమావేశంలో డీసీఎంఎస్ చైర్మన్ గొండు కృష్ణమూర్తి, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ శిమ్మ నేతాజీ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కే.శ్రీధర్, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ శ్రీనివాసరావు, బి.ఆర్.ఆర్ వంశధార ప్రాజెక్టు ఎస్‌ఈ డోల తిరుమలరావు, జిల్లా ఉద్యాన అధికారి ప్రసాద్, డీఎస్‌ఓ వెంకట రమణ, జల వనరుల శాఖ ఎస్‌ఈ పొన్నాడ సుధాకర్, పశు సంవర్ధక శాఖ జేడీ కిశోర్, మత్స్య శాఖ నుంచి గంగాధర్, డ్వామా పీడీ చిట్టి రాజు, రైస్ మిల్లర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వాసు, పలువురు ఏడీలు తదితరులు హాజరయ్యారు.

క్లుప్తంగా

'ల్యాండ్ టైటిల్ చట్టంపై పోరాడతాం'

శ్రీకాకుళం పాతబస్టాండ్: ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన ల్యాండ్ టైటిల్ చట్టంపై శ్రీకాకుళం జిల్లా బార్ అసోసియేషన్ న్యాయవాదులు హైకోర్టును ఆశ్రయించనున్నారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా బార్ అసోసియేషన్ భవనంలో జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఎన్ని సూర్యారావు ఆధ్వర్యంలో న్యాయవాదుల అసోసియేషన్ సర్వసభ్య సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది. సూర్యారావు మాట్లాడుతూ సభ్యులందరి అభిప్రాయం మేరకు లాండ్ టైటిల్ చట్టంపై హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేయాలని నిర్ణయించామన్నారు. జిల్లా బార్ అసోసియేషన్ పూర్వ అధ్యక్షుడు, సీనియర్ న్యాయవాది వాన కృష్ణచంద్ మాట్లాడుతూ ఈ చట్టం న్యాయవాద వృత్తికి ప్రమాదకరంగా పరిణమిస్తుందన్నారు.

'మైనారిటీ హక్కులు తెలుసుకోవాలి'



సమావేశంలో మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి సన్యాసినాయుడు

శ్రీకాకుళం పాతబస్టాండ్: మైనారిటీలకు అనేక హక్కులు ఉన్నాయని, వాటిని వారు తెలుసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు సూచించారు. ఆయన శుక్రవారం జామియా మసీదు ప్రాంగణంలో మైనారిటీలకు ఉన్న హక్కుల గురించి న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రాజ్యాంగం ఇచ్చిన హక్కుల గురించి అందరూ తెలుసుకోవాలని సూచించారు.

'ప్రజాస్వామ్యాన్ని కాపాడాలి'

శ్రీకాకుళం: ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని ఇండియా కూటమి నాయకులు పీసీసీ ప్రధాన కార్యదర్శి ఎస్.అన్నాజీరావు, గోవింద్, పి.నాగభూషణరావు, రాష్ట్ర ఎస్టీ సెల్ చైర్‌పర్సన్ పి.శాంతికుమారిలు అన్నారు. నగరంలో అంబేడ్కర్ కూడలి వద్ద ఇండియా కూటమి ఆధ్వర్యంలో శుక్రవారం బీజేపీపై నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారం చేపట్టి ఆర్ఎస్ఎస్ భావజాలంతో నిరంకుశత్వ ధోరణితో పరిపాలన చేస్తోందన్నారు. పార్లమెంట్‌లో భద్రత వైఫల్యాలపై ప్రశ్నించాలని తెలిపారు.

24న తూర్పుకాపుల ఆత్మీయ సమ్మేళనం

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): తూర్పుకాపు ఆత్మీయ సమ్మేళనం (పిక్‌నిక్) ఈ నెల 24న ఎచ్చెర్లలోని కేశవరెడ్డి స్కూల్ పక్కన గల తోటలో నిర్వహించనున్నట్లు జిల్లా తూర్పుకాపు సంక్షేమ సంఘం ప్రతినిధులు తెలిపారు. ఈ ఆత్మీయ సమ్మేళనానికి తూర్పుకాపు సామాజికవర్గ సభ్యులంతా హాజరవ్వాలని కోరారు. ఈ మేరకు తూర్పుకాపు సంక్షేమ సంఘం ప్రతినిధులు సురంగి మోహనరావు, లంక గాంధీ, ఈఋజ్జాడ శ్రీనివాస్‌లు ఓ ప్రకటన విడుదల చేశారు.

రాష్ట్రస్థాయి షార్ట్ ఫిల్మ్ పోటీల్లో ప్రతిభ



అవార్డు అందుకుంటున్న ఉపాధ్యాయుడు అప్పలరాజు, విద్యార్థులు

పాతపట్నం: రాష్ట్రస్థాయి షార్ట్ ఫిల్మ్ పోటీల్లో పాతపట్నం ప్రభుత్వ ఆదర్శ పాఠశాలకు చెందిన విద్యార్థులు తీసిన లఘు చిత్రం మూడో స్థానం దక్కించుకుంది. ఇటీవల ఏపీ రాష్ట్ర శక్తి పరిరక్షణ మిషన్ విభాగం వారు రాష్ట్ర వ్యాప్తంగా షార్ట్ ఫిలిం పోటీలు నిర్వహించారు. పోటీల్లో రాష్ట్రంలోని 26 జిల్లాల నుంచి వివిధ పాఠశాలలు పాల్గొన్నాయి. ఇందులో పాతపట్నం ప్రభుత్వ ఆదర్శ పాఠశాల విద్యార్థులు తీసిన కన్జర్వ్-2 (సంరక్షించు-2) అనే రెండు నిమిషాల లఘు చిత్రం ఉత్తమ షార్ట్ ఫిలింగా మూడో స్థానం సాధించింది. విజయవాడ వివంత హోటల్‌లో నిర్వహించిన శక్తి పరిరక్షణ ముగింపు వారోత్సవాల కార్యక్రమంలో మేనేజింగ్ డైరెక్టర్ ఏపీ జెన్‌కో కేవీఎన్ చక్రధర్ బాబు చేతులమీదుగా అవార్డును ఉపాధ్యాయుడు అప్పలరాజు, విద్యార్థులు రోహిత్ శ్రీసాయి, ప్రీతంలు అందుకున్నారు.

ఆగి ఉన్న లారీని ఢీకొని యువకుడు మృతి

టెక్కలి రూరల్: చిన్ననారాయణపురం గ్రామ సమీపంలో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో నౌపడ గ్రామానికి చెందిన లోపిండి శేషరెడ్డి (27) మృతి చెందాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శేషురెడ్డి తన వ్యక్తిగత పనుల కోసం బైక్‌పై టెక్కలి వచ్చి తిరిగి వెళ్తుండగా చిన్ననారాయణపురం సమీపంలో.. మూడు రోజులుగా రోడ్డు పక్కన నిలిపేసి ఉన్న లారీని ఢీకొట్టాడు. ఘటనలో శేషు రెడ్డికి బలమైన దెబ్బలు తగలడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు టెక్కలి ఎస్ఐ-2 రమేష్ బాబు తెలిపారు. ఇతనికి తల్లిదండ్రులు లేకపోవడంతో వారి సోదరి ఇంటిలో ఉంటున్నాడు. ఘటనపై టెక్కలి ఎస్ఐ-2 రమేష్ బాబు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు.

ఉత్తర ద్వార దర్శనాలకు వేళాయె



ముస్తాబైన శ్రీకాకుళంలోని నారాయణ తిరుమల ఆలయం

అరసవల్లి:

వైకుంఠ ఏకాదశి సందర్భంగా శనివారం ఉత్తర ద్వార దర్శనాలకు ఆలయాల్లో ఏర్పాట్లు చేశారు. ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయం వైకుంఠ ఏకాదశి (ముక్కోటి ఏకాదశి) పర్వదినానికి ముస్తాబైంది. వేకువజాము నుంచి దర్శనాలు ప్రారంభం కానుండడంతో ఆలయ ఈఓ వి.హరిసూర్యప్రకాష్, ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మల ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఉత్తర ద్వార మండపంలో స్వామి వారి ఉత్సవ మూర్తులను వేంచేసింపజేసేలా సింహాసనాన్ని సిద్ధం చేశారు. ముందుగా తిరువీధిగా వచ్చిన స్వామి ఉత్సవమూర్తులను ఉత్తర ద్వారం గుండా ఆలయం లోనికి పంపించిన అనంతరరం భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కలిగేలా చర్యలు చేపట్టనున్నారు. భక్తులకు ఆలయ ప్రధాన ద్వారం ఉత్తరాన ప్రత్యేక క్యూలైన్ ద్వారానే అనుమతించనున్నారు. ఉత్తర ద్వార దర్శన మండపాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. శనివారం, ఆదివారాల్లో రెండు రోజుల పాటు గర్భాలయంలో స్వామి వారి మూలవిరాట్టుకు పూర్తిగా స్వర్ణాలంకరణలో దర్శనం కల్పించేలా చర్యలు చేపడుతున్నారు. ఈ రెండ్రోజులు గట్టి బందోబస్తును ఏర్పాటు చేయనున్నారు.



వైకుంఠ ఏకాదశికి వాసుదేవ ఆలయాన్ని ముస్తాబు చేస్తున్న దృశ్యం

వాసుదేవుని ఆలయం సిద్ధం

మందస: వైకుంఠ ఏకాదశికి వాసుదేవ పెరుమాళ్ ఆలయం ముస్తాబవుతోంది. ఉత్తర ద్వార దర్శనం కల్పిస్తుండడంతో వైకుంఠ ఏకాదశి రోజున భక్తుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. దీంతో ఆలయ ప్రధాన అర్చకులు, వేదపండితులైన గోపినంబాళ్ల దాసు కూర్మాచార్యులు ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. పుష్పాలంకరణ, రంగు, రంగుల విద్యుద్దీపాలతో ఆలయాన్ని అందంగా తీర్చిదిద్దుతున్నారు.



అరసవల్లిలో సిద్ధం చేసిన ఉత్తర ద్వారం

'దీక్ష'గా పతకాల పంట

శ్రీకాకుళం న్యూకాలనీ: ఈత పోటీల్లో దీక్షా బెహరా చరిత్ర సృష్టించింది. స్కూల్‌గేమ్స్ చరిత్రలో అండర్-14 విభాగంలో మూడు బంగారు పతకాలు సాధించి శభాష్ అనిపించి నేరుగా జాతీయ పోటీలకు ఎంపికైంది. 67వ ఏపీ రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ అండర్-14 బాలబాలికల స్విమ్మింగ్ చాంపియన్‌షిప్-2023 పోటీలు ఈనెల 18 నుంచి 20వ తేదీ వరకు విజయవాడ వేదికగా జరిగాయి. ఈ పోటీల్లో శ్రీకాకుళం జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహించిన దీక్షా బెహరా మూడు బంగారు పతకాలతో సంచలనం సృష్టించింది. 50 మీటర్ల బ్రెస్ట్ స్ట్రోక్, 50మీటర్ల బ్యాక్ స్ట్రోక్, 100మీటర్ల బ్రెస్ట్ స్ట్రోక్ ఈవెంట్స్‌లో పతకాల పంట పండించింది. దీంతో 2024 జనవరి 3 నుంచి 9వ తేదీ వరకు న్యూఢిల్లీలో జరిగే ఆలిండియా స్కూల్‌గేమ్స్ బాలబాలికల స్విమ్మింగ్ చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికైంది.

శ్రీకాకుళం సమీపంలోని పాత్రునివలసలో నివాసం ఉంటున్న మండల యుగంధర్, బసంతి బెహరాల కుమార్తె దీక్షా బెహరా. తండ్రి మెకానిక్‌గా పని చేస్తుండగా, తల్లి గృహిణి. దీక్ష ఇప్పుడు శ్రీకాకుళంలోని కేంద్రీయ విద్యాలయంలో 8వ తరగతి చదువుతోంది. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో గత ఐదారేళ్లుగా స్విమ్మింగ్‌లో అనేక జాతీయ, రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తాచాటుతూ వస్తోంది. చదువుల్లోనూ రాణిస్తోంది. దీక్ష జాతీయ పోటీలకు ఎంపిక కావడంపై కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపాల్ షోయబ్ ఆలం, పీడీ సుందరరావు, డీఎస్‌డీఓ డాక్టర్ శ్రీధర్ రావు, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి బీవీ రమణ, క్రీడాకారులు హర్షం వ్యక్తం చేశారు.



మూడు పతకాలు సాధించిన దీక్షా బెహరాను అభినందిస్తున్న కేవీ ప్రిన్సిపాల్ షోయబ్ ఆలం

పాణిగ్రాహికి విప్లవ నివాళులు



సుబ్బారావు పాణిగ్రాహి చిత్రపటానికి పూలమాల వేస్తున్న దృశ్యం

పలాస: బొడ్డపాడు జిల్లా అమరవీరుల స్మారక మందిరం వద్ద శుక్రవారం సుబ్బారావు పాణిగ్రాహి 54వ వర్ధంతి సభను ఘనంగా నిర్వహించారు. ముందుగా పాణిగ్రాహి సతీమణి సురేఖ అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆమె పాణిగ్రాహి చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. ఆ తర్వాత జిల్లా నలుమూల నుంచి పెద్ద ఎత్తున హాజరైన వివిధ ప్రజాసంఘాల నాయకులు పూలమాలతో నివాళులర్పించారు. అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నశెట్టి రాజశేఖర్, ప్రజాకళామండలి జిల్లా అధ్యక్షుడు రాపాక చిరంజీవి అధ్యక్షతన జరిగిన ఈ సభలో ప్రధాన వక్తలుగా ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లక్ష్మి, విరసం రాష్ట్ర నాయకులు పాణి ప్రసంగిస్తూ శ్రీకాకుళం గిరిజన రైతాంగ సాయుధ పోరాట యోధుడు, విప్లవ కవి సుబ్బారావు పాణిగ్రాహి ఆశలు ఆశయాలు ఏ మేరకు అవసరమన్నది వివరించారు. హక్కుల కోసం ఉద్యమించాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రజాకళా మండలి రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.నీలకంఠం, ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా నాయకురాలు పోతనపల్లి కుసుమ, గొరకల బాలకృష్ణ, డాక్టరు ఖగేశ్వరరావు, దాసరి శ్రీరాములు, తామాడ త్రిలోచనరావు, కళాకారులు పాల్గొన్నారు.

యూఏఈలో సీఎం వైఎస్ జగన్ జన్మదిన వేడుకలు

పొందూరు: యూఏఈలోని షార్జాలో సీఎం వైఎస్ జగన్ జన్మదిన వేడుకలను వైఎస్సార్ సీపీ అభిమానులు ఘనంగా నిర్వహించారు. కోటేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో పుట్టిన రోజు వేడుకలు నిర్వహించారు.



యూఏఈలో జగనన్న జన్మదిన వేడుకలు జరుపుకుంటున్న వైఎస్సార్ సీపీ అభిమానులు

వీ జ్యువెలరీ మార్ట్ ప్రారంభం

దాబాగార్డెన్స్ (విశాఖపట్నం): హోటల్ మేఘాలయ సమీపంలోని నవరత్న ట్రేడ్ సెంటర్ 6వ అంతస్తులో ఏర్పాటు చేసిన 'వీ జ్యువెలరీ మార్ట్'ను శుక్రవారం సంస్థ మేనేజింగ్ డైరెక్టర్, నవరత్నం ఎస్టేట్స్ ప్రతినిధి సురేష్‌కుమార్ జైన్ ప్రారంభించారు. వైశ్యరాజు జ్యూయలర్స్ అధినేత వైశ్యరాజు ఫల్గుణరాజు జ్యోతి ప్రజ్వలన చేశారు. మంచుకొండ శ్యామ్, నవరత్న ఎస్టేట్స్ డైరెక్టర్ మొదటి కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా వీ జ్యువెలరీ మార్ట్ మేనేజింగ్ డైరెక్టర్ సురేష్‌కుమార్ మాట్లాడుతూ ఫ్యాక్టరీ ధరకే బంగారు ఆభరణాలు అందిస్తున్నట్లు తెలిపారు. వీవీఎస్ క్లారిటీ, ఈఎఫ్ కలర్ గల డైమండ్స్ క్యారెట్ రూ.49,900 నుంచి ప్రారంభమని, వాటిపై తరుగు, మజూరీ లేదన్నారు. జీఎస్టీ కూడా కస్టమర్ల తరఫున తామే చెల్లిస్తామన్నారు. రెగ్యులర్ వెండి వస్తువులపై కూడా తరుగు, మజూరీ లేదన్నారు. అత్యుత్తమమైన డిజైనరీ ఆభరణాలు ఫ్యాక్టరీ ధరకు ఎవరూ ఇవ్వలేరని, ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని బ్రాంచ్ మేనేజర్ సయ్యద్ ఖాదర్ కోరారు.



జ్యూయలరీ మార్ట్ ప్రారంభిస్తున్న సురేష్‌కుమార్



కస్టమర్లతో కళకళలాడుతున్న వీ జ్యూయలరీ మార్ట్

శ్రీకాకుళం టు గోవా ఐఐటీ

- గోవా ఐఐటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఎంపికైన జిల్లా వాసి



డాక్టర్ సువ్వారి ఆనందరావు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాకు చెందిన డాక్టర్ సువ్వారి ఆనందరావు ప్రతిష్టాత్మక విద్యాసంస్థలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఉద్యోగం సాధించారు. ఆయన స్వస్థలం ఎచ్చెర్ల మండలం పొన్నాడ పంచాయతీ పరిధిలోని కమ్మువారిపేట గ్రామం. అత్యున్నత ప్రమాణాలు కలిగిన గోవా ఐఐటీ సంస్థలో ఆర్థిక శాస్త్రం విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా డాక్టర్ ఆనందరావు ఉగ్యోగానికి ఎంపికయ్యాడు. శుక్రవారమే ఆయన బాధ్యతలు స్వీకరించారు. కమ్మువారిపేటకు చెందిన సువ్వారి నీలాచలం, పద్మావతిలు ఆనందరావు తల్లిదండ్రులు. పాఠశాల స్థాయి నుంచి ఆనందరావు చదువుల్లో చురుగ్గా ఉండేవారు. ప్రాథమిక విద్య అనంతరం ఎకనామిక్స్‌పై ఆసక్తితో హైదరాబాద్ విశ్వవిద్యాలయంలో ఐఎంఏలో చేరి ఉత్తీర్ణులయ్యారు. అక్కడే క్యాంపస్ ఇంటర్వ్యూ ద్వారా ఓ బీమా సంస్థలో అసిస్టెంట్ మేనేజర్‌గా పని చేశారు. అయితే పరిశోధనలపై ఉన్న ఆసక్తితో 'ఎఫీషియన్సీ అండ్ ఫెర్మార్మన్స్ అసెస్‌మెంట్ ఆఫ్ లైఫ్ ఇన్సూరెన్స్ ఇండస్ట్రీ, సమ్ న్యూ ఎవిడెన్స్ ఫర్ ఇండియా' అనే అంశంపై పీహెచ్‌డీ పూర్తిచేసి చేసి డాక్టరేట్ అందుకున్నారు. అనంతరం ఆయన 2019 జూలై నుంచి 2020 వరకు ఏపీ కేంద్రీయ విశ్వవిద్యాలయంలో ఎకనామిక్స్ విభాగంలో అధ్యాపకులుగా పనిచేశారు. 2020 నవంబరు నుంచి 2023 జనవరి వరకూ ఏపీ ఎస్ఆర్ఎం విశ్వ విద్యాలయంలో సహాయ ఆచార్యునిగా, ఎకనామిక్స్ హెచ్ఓడీగా బాధ్యతలు నిర్వర్తించారు. అనంతరం 2023 నుంచి హైదరాబాద్‌లోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ టెక్నాలజీ (ఐఎంటీ) హైదరాబాద్‌లో ప్రొఫెసర్‌గా పనిచేస్తూ.. తాజాగా ప్రతిష్టాత్మక ఐఐటీ గోవాలో ఉన్నత స్థాయి ఉద్యోగానికి ఎంపికయ్యారు. ఇప్పటివరకు ఆయన ప్రచురించిన జర్నల్స్ అంతర్జాతీయ పత్రికల్లోనూ ప్రచురితమయ్యాయి.

17,505 గిరిజన గృహాలకు ఉచిత విద్యుత్ మీటర్లు

- ఈ నెల 24 నాటికి సర్వే పూర్తి
- గ్రామీణ ప్రాంతాల్లో త్రీఫేజ్ విద్యుత్ సౌకర్యం
- ఏపీఈపీడీసీఎల్ డైరెక్టర్ (ప్రాజెక్టులు) సూర్యప్రతాప్

సీతంపేట: ఏపీఈపీడీసీఎల్ పరిధిలోని 3,761 గిరిజన గ్రామాల్లో 17,505 గృహాలకు ఉచితంగా విద్యుత్ మీటర్లు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఆ శాఖ డైరెక్టర్ (ప్రాజెక్టులు) ఏవీవీ సూర్యప్రతాప్ తెలిపారు. విద్యుత్ కనెక్షన్లపై పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేట ఏజెన్సీలో జరుగుతున్న సర్వేను శుక్రవారం పరిశీలించారు. అనంతరం స్థానిక ట్రాన్స్‌కో కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. విశాఖపట్నం, విజయనగరం, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, శ్రీకాకుళం జిల్లాల్లోని ఏజెన్సీలో పీవీటీజీ గిరిజనులకు ఎన్ని కుటుంబాలకు విద్యుత్ కనెక్షన్లు లేవనేదానిపై సర్వే చేస్తున్నామన్నారు. ఈ నెల 24 నాటికి సర్వే పూర్తవుతుందని చెప్పారు. ఆ తర్వాత ఉచిత విద్యుత్ మీటర్లు ఇచ్చి ప్రతీ ఇంటికి విద్యుత్ సదుపాయం కల్పిస్తామని స్పష్టంచేశారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో అత్యధికంగా 2,095 హేబిటేషన్లలో 13,600ల గృహాలకు విద్యుత్ సదుపాయం లేదని అధికారులు, ప్రజాప్రతినిధుల నుంచి నివేదికలు అందాయన్నారు. విజయనగరం జిల్లాలో 553 హేబిటేషన్లకు 1367, ఏలూరులో 95 గ్రామాల్లో 409, తూర్పుగోదావరి జిల్లాలో 625 గ్రామాలకు 4013 కుటుంబాలకు విద్యుత్ మీటర్లు లేవన్నారు. అలాగే, శ్రీకాకుళంలో 451 హేబిటేషన్లకు 1468 ఇళ్లకు విద్యుత్ సదుపాయం లేదన్నారు. వీటికి యుద్ధప్రాతిపదికన ఉచిత కనెక్షన్లు ఇప్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

అన్నదాతకు మద్దతు

- సీజన్ ప్రారంభానికి ముందే మద్దతు ధర ప్రకటించిన ప్రభుత్వం
- సీఎం యాప్ ద్వారా ప్రతి పంటను ఆర్‌బీకే ద్వారా కొనుగోలు చేసేలా చర్యలు
- 2023-24లో వేసే పంటలు వాటి మద్దతు ధరలు విడుదల

2023-24కు గాను పంటలు.. వాటి మద్దతు ధరలు

పంటపేరు	మద్దతు ధర (క్వింటా రూ.ల్లో)	కొనుగోలు కాలం
పసుపు	6,850	ఫిబ్రవరి నుంచి మే
మిర్చి	7,000	డిసెంబర్ నుంచి మే
ఉల్లి	770	రబీ.. మార్చి నుంచి మే, ఖరీఫ్..అక్టోబర్ నుంచి డిసెంబర్
చిరుధాన్యాలు కొర్రలు, అరికెలు, వరిగలు, ఊదలు, సామలు	2,500	రబీ మార్చి నుంచి మే, ఖరీఫ్ అక్టోబర్ నుంచి డిసెంబర్
ధాన్యం (కామన్)	2183	రబీ ఏప్రిల్ నుంచి సెప్టెంబర్, ఖరీఫ్ అక్టోబర్ నుంచి మార్చి
ధాన్యం (గ్రేడ్-ఎ)	2203-00	రబీ ఏప్రిల్ నుంచి సెప్టెంబర్, ఖరీఫ్ అక్టోబర్ నుంచి మార్చి
జొన్నలు, మాలదండి జొన్నలు(హైబ్రిడ్)	3225, 3180	రబీ మార్చి నుంచి మే, ఖరీఫ్ అక్టోబర్ నుంచి డిసెంబర్
సజ్జలు	2500	రబీ మార్చి నుంచి మే, ఖరీఫ్ అక్టోబర్ నుంచి డిసెంబర్
రాగులు	3845	రబీ మార్చి నుంచి మే, ఖరీఫ్ అక్టోబర్ నుంచి డిసెంబర్
మొక్కజొన్న	2090	రబీ మార్చి నుంచి మే, ఖరీఫ్ అక్టోబర్ నుంచి డిసెంబర్
కందులు	7000	ఖరీఫ్ ఫిబ్రవరి నుంచి ఏప్రిల్
పెసలు	8558	రబీ ఫిబ్రవరి నుంచి మే, ఖరీఫ్ అక్టోబర్ నుంచి డిసెంబర్
మినుములు	6950	రబీ మార్చి నుంచి మే, ఖరీఫ్ అక్టోబర్ నుంచి డిసెంబర్
వేరుశనగ	6377	ఖరీఫ్ నవంబర్ నుంచి ఫిబ్రవరి
కొబ్బరి (మర)	10860	ఆగస్టు నుంచి ఫిబ్రవరి
కొబ్బరి (లాల్)	11750	ఆగస్టు నుంచి ఫిబ్రవరి
కాటన్ (పత్తి) పొట్టి గింజ	6620	రబీ నవంబర్ నుంచి మే
కాటన్ పత్తి పొడవు గింజ	7020	రబీ నవంబర్ నుంచి మే
అరటి	800	జనవరి నుంచి మార్చి, జూన్ నుంచి ఆగస్టు
సోయాబిన్	4600	ఖరీఫ్ అక్టోబర్ నుంచి డిసెంబర్
పొద్దుతిరుగుడు	6760	రబీ మార్చి నుంచి మే, ఖరీఫ్ అక్టోబర్ నుంచి డిసెంబర్

శ్రీకాకుళం రూరల్: అన్నదాతకు ప్రభుత్వం అన్నింటా మద్దతుగా నిలుస్తోంది. సీజన్ ప్రారంభానికి ముందే మద్దతు ధర ప్రకటిస్తామని చెప్పిన సీఎం వైఎస్ జగన్ ఆ దిశగా చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే వ్యవసాయ ఉత్పత్తులకు మద్దతు ధర ప్రకటిస్తూ ఆర్‌బీకేల ద్వారా పంట కొనుగోళ్లను ప్రారంభిస్తున్నారు. రవాణా ఖర్చులు, దళారీ వ్యవస్థ లేకుండా రైతు భరోసా కేంద్రాల్లో సీఎం యాప్ ద్వారా పండిన ప్రతి పంటను ప్రభుత్వమే కొనుగోలు చేసేలా ఏర్పాట్లు చేస్తున్నారు. మద్దతు ధరలకు పంటలను అమ్ముకోవాలంటే రైతులు తప్పనిసరిగా ఈ క్రాప్‌లో పంటల వివరాలను నమోదు చేసుకోవాలి. అలా నమోదు చేసుకున్న తర్వాతే రైతు భరోసా కేంద్రాల్లో గ్రామ వ్యవసాయ సహాయకులు లేదా గ్రామ ఉద్యాన సహాయకులు వద్ద సీఎం యాప్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకుంటే కనీస గిట్టుబాటు ధర దక్కని పరిస్థితుల్లో వెంటనే కొనుగోలు చేస్తారు. వీటితో పాటు రైతులు తమ పంటను కొనుగోలు కేంద్రాల్లో విక్రయించిన తర్వాత గూగుల్ ప్లే స్టోర్ నుంచి సీఎం యాప్ ఫార్మర్ పేమెంట్ స్టేటస్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని తమ చెల్లింపుల స్థితిగతులు కూడా తెలుసుకోవచ్చు.



ప్రతి పంటను కొనుగోలు చేస్తాం



ఈ ప్రభుత్వంలో రైతు పండించిన ప్రతి పంటను ఆర్‌బీకేల ద్వారా కొనుగోలు చేస్తాం. ప్రభుత్వం కేటాయించిన మద్దతు ధరను పది రోజుల్లోగా అందిస్తాం. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. రైతన్నలకు కనీస గిట్టుబాటు ధర లభించేందుకు గాను రూ. 3వేలు కోట్లతో ధరల స్థిరీకరణ నిధిని రాష్ట్రంలోనే తొలిసారిగా ఏర్పాటు చేశారు.

– ఉషాకుమారి, వ్యవసాయాధికారి